క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



ఆలయ కమిటీ సభ్యులకు చెక్ అందిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని గోసాం గ్రామంలో సీతారామాలయ ప్రతిష్టాపన మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలకు పూలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించి ప్రతిష్ఠన జరిపించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం మండలం అర్జునవలస పంచాయతీ గిరివాని పాలెంలో బంగారమ్మ తల్లి గ్రామదేవత పండగ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్స్ నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం పైడి భీమవరంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మీసాల లక్ష్మీరామునాయుడు, కూటమి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: చినరావుపల్లిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారుకు 100 రోజులు పని కల్పించనున్నట్లు చెప్పారు. గరిష్ట వేతనం వచ్చేలా పనులు చేయాలని సూచించారు.

అజ్ఞాత వ్యక్తుల సమాచారమివ్వండి

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్ఞాత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన జాలారు కొయ్యాం, మూసవానిపేట, గిన్నివానిపేట గ్రామాల్లో గురువారం మత్స్యకారులు, గ్రామపెద్దలు, విజిలెన్స్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. తీరం వెంబడి అజ్ఞాత వ్యక్తులు కనిపిస్తే టోల్ ఫ్రీ 1093, 9392914712 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 10న రెడ్‌క్రాస్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నేత్ర, దంత, చిన్నపిల్లలు, సాధారణ జబ్బులు, గుండెపోటు, బీపీ, షుగర్, థైరాయిడ్, ఎముకలు, కీళ్ల నొప్పులకు నిష్ణాతులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంగమ్మతల్లికి బోనాల పూజలు

జి.సిగడాం : మండలంలోని సంతవురిటి గ్రామంలో రంగమ్మ తల్లికి గురువారం భక్తులు బోనాలు సమర్పించారు. వైశాఖమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

నవధాన్యాల సాగుతో బాగు

గార: పచ్చిరొట్ట విత్తనాలతో మరో 25 రకాల విత్తనాలు కలిపి సాగు చేసుకోవడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌చార్జి జి.గణమ్మ అన్నారు. గురువారం రామచంద్రపురం రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల సాగు ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. వరి ఎద సాగులో తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. ఎకరా భూమిలో 10 నుంచి 12 కేజీల విత్తనాలు చల్లుకొని 45 రోజుల తర్వాత కలియదున్నడం వల్ల పోషకాలు అంది భూమి సారవంతమవుతుందని చెప్పారు.

విద్యార్థుల రక్తదానం

ఎచ్చెర్ల క్యాంపస్: వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా తలసేమియా బాధితుల కోసం చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్, ఫార్మసీ, సంత సీతారాంపురంలోని సైకి వ్యవసాయ కళాశాలల విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. విద్యార్థులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, ఆర్డీవో సాయిప్రత్యూష, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు అభినందించారు.

పంట నష్టం.. ఎంత కష్టం!

- ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు భారీగా పంట నష్టం
- పరిహారం చెల్లించక చేతులెత్తేసిన కూటమి సర్కారు
- కనీసం పంట నష్టం నివేదిక తయారు చేయని వైనం
- వాణిజ్య పంటల రైతులకు కోలుకోలేని దెబ్బ



ఇటీవల వీచిన గాలులకు నారువలో పడిపోయిన అరటి పంటను చూపుతున్న రైతు(ఫైల్)

రణస్థలం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు రైతన్నను ఆర్థికంగా కుదేలు చేశాయి. గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మండు వేసవిలో విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం పూట విపరీతమైన ఎండకాస్తూ.. సాయంత్రం, రాత్రి వేళల్లో విపరీతమైన గాలులతో కూడిన వర్షాలు వాణిజ్య పంటలను అస్తవ్యస్తం చేసేశాయి. ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా వాణిజ్య పంటలు వేసిన రైతులకు ఈ ఏడాది తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అరటి, మామిడి, జీడి, పుచ్చకాయలు రైతులకు పూర్తి నష్టాలనే మిగిల్చాయి. తీవ్రమైన గాలులకు వందఎకరాల్లో అరటి పంట నేలకొరగగా, చేతికందిన మామిడి కాయలు నేలపాలయ్యాయి. వాతావరణం అనుకూలించక కర్బూజా రైతులు కుదేలైపోయారు.

ఇదీ పరిస్థితి..

రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో అధిక విస్తీర్ణంలో వాణిజ్య పంటలు సాగు చేశారు. రణస్థలం మండలంలోని నారువ, మెంటాడ, చిల్లపేటరాజం, కమ్మసిగడాం, అర్జునవలస, వెల్పురాయి, రణస్థలం, నగరప్పాలెం, లావేరు మండలంలోని వేణుగోపాలపురం, తామాడ, లక్ష్మీపురం, రౌతుపేట, కేశవరాయునిపాలెం, లావేరు, గోవిందపురం, ఇచ్చాడపాలెం, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో వందలాది ఎకరాల్లో అరటి పంట ఇటీవల వీచిన ఈదురు గాలులకు నేలకొరిగింది. జీడి, మామిడి, కర్బూజా పంటలకు సైతం నష్టం వాటిల్లింది.

చేతులెత్తేసిన సర్కారు..

అకాల వర్షాలకు రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం ఎటువంటి పరిహారం ప్రకటించలేదు. దింతో రైతన్నలు ఈ ఏడాది భారీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. జీడి, మామిడి, కర్బూజా పంటలకు సరైన మార్కెట్ లేకపోవడం వల్ల ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించాల్సి ఉన్నా కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో అరటి, వేల ఎకరాల్లో జీడి, మామిడి, కర్బూజా పంటలకు నష్టం చేకూరినా అధికారులు స్పష్టమైన నివేదిక తయారు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు నారువ పంచాయతీలో అరటి పంటకు వందలాది ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్ట పరిహారం ప్రకటించి ఆదుకోవాలి. లేదంటే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతారు.

– పాల రాము, నారువ, రణస్థలం మండలం

ఏక పంటగా ఉంటేనే..

ఇటీవల అకాల వర్షాలు, ఈదురు గాలులకు చిల్లపేటరాజం, నారువ తదితర గ్రామాల్లో అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. ఏక పంటగా ఉంటేనే పంట నష్టం నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. అంతర పంటల్లో వేసిన అరటి పడిపోయినా, వాటికి పంట వాటిల్లినా నమోదు చేయం.

– అనూష, ఉద్యానవన అధికారి, రణస్థలం

12న అన్నమయ్య జయంతి ఉత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 12న తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీవాణీ సంగీత కళాక్షేత్రం వ్యవస్థాపకులు దుంపల ఈశ్వరరావు తెలిపారు. బలగలోని వాణీ సంగీత కళాక్షేత్రంలో ఉత్సవ కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 12 సంగీత విద్యాలయాల కళాకారులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. ఉదయం 8గంటలకు శివశ్రీ నృత్య కళానికేతన్ గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రాత్రి 7.30 గంటల వరకు వివిధ సంగీత విద్యాసంస్థల విద్యార్థులతో అన్నమయ్య సంకీర్తనార్చన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో శిష్యులు, అభిమానులు పాల్గొన్నారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న పార్టీ నాయకులు

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్ అన్నారు. గురువారం సంతవురిటి, ధవళపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లు, ఇతర పథకాల కోసం పల్లెల్లో వందలాది మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, సర్పంచులు వడిశ మహేశ్వరరావు, బుడారి లక్ష్మణరావు, కంచరాన రమణారావు, పేడాడ శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

283 మంది విద్యార్థినులకు డిగ్రీ పట్టాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: డిగ్రీ పట్టాలను అందుకునే విద్యార్థినుల జాబితా ఖరారైంది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2022–25 విద్యా సంవత్సరానికిగాను 411 మంది డిగ్రీలో ప్రవేశం పొందారు. వీరిలో అన్ని సెమిస్టర్లతోపాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన 283 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టాను అందుకునేందుకు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు గురువారం ప్రకటించారు. త్వరలోనే పట్టాలు ప్రదానం చేస్తామని చెప్పారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం/ శ్రీకాకుళం అర్బన్: దేశం గర్వించదగ్గ నేత, దివంగత సీఎం దామోదరం సంజీవయ్య అని దామోదరం సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంత వేణు, ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను అన్నారు. గురువారం సంజీవయ్య పార్కులో దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించి సీఎం పదవిని అధిరోహించిన మహా నాయకుడు సంజీవయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్స్ ఇండియా మిషన్, దళిత సంఘాల నాయకులు పురుషోత్తం, రాంబాబు, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావుతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు.. సంజీవయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 550కు పైగా మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు సంఘ అధ్యక్షుడు యేసో శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఇమంది విశ్వేశ్వరరావు, కోశాధికారి గుదే సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల వారు ఈ నెల 15లోగా శ్రీకాకుళం పద్మశాలి సంక్షేమ సంఘం కార్యాలయంలో గానీ, 7032043400 నంబరును గానీ సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్‌పురం, చినరావుపల్లి, జరజాం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత అమలు చేయనున్నట్లు చెప్పారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



దేఅండ్‌నైట్ కూడలి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్/జి.సిగడాం : జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో ఎటువంటి అలజడులు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బృందాలుగా వీడి విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం రాత్రి ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఉత్తర్వుల మేరకు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలోని ఐదు పోలీసు బృందాలు లాడ్జీల్లో కొత్త వ్యక్తుల చేరికపై ఆరా తీయడమే కాక ఆర్టీసీ బస్‌కాంప్లెక్సు, డేఅండ్‌నైట్ పరిసర ప్రాంతాల్లో వాహన తనిఖీలు జరిపారు. జి.సిగడాం మండలం రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారి మెట్టవలస కూడలి వద్ద ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఏఎస్ఐ పొగిరి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో షిరిడిసాయి మందిరం వద్ద వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. షిరిడిసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ

- పట్టించుకోని పంచాయతీ, రెవెన్యూ అధికారులు
- కలెక్టర్‌కు పోస్టు ద్వారా ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



పంచాయతీ రిజర్వుడు స్థలంలో నిర్మాణం జరుగుతున్న దృశ్యం

గార : మండలంలోని మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో పంచాయతీ రిజర్వుడు స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఏకంగా నిర్మాణం జరుగుతున్నా పంచాయితీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకూర్మం సర్వే నెంబరు 600లో 8.5 సెంట్ల స్థలం గ్రామం మధ్యలో ఉంది. 2019లో పంచాయతీ తీర్మానం చేసి ఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఇందులో కూర్మనాథాలయానికి వచ్చే దూర ప్రాంత భక్తులు ఉండేలా ఉచిత కాటేజీ నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అప్పట్లో భూమిపూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు. స్థల విషయమై హైకోర్టుకు ఒక వ్యక్తి వెళ్లినా రికార్డులు ప్రకారం పంచాయతీ రిజర్వుడు స్థలమని 2022లోనే తీర్పునిచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో స్థలం ఆక్రమణ చేసేందుకు సంబంధిత వ్యక్తి ప్రణాళిక వేశాడు. టీటీపీ నాయకుల సహకారంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించేశాడు. పంచాయతీ రిజర్వుడు స్థలంలో ఎలా నిర్మాణాలు చేపడతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై కొందరు గ్రామస్తులు సంతకాలు సేకరించి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు పోస్టు ద్వారా వినతిపత్రం పంపించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా స్థలం వైపు రెవెన్యూ అధికారులు ఎవ్వరూ వెళ్లవద్దని పెద్ద నాయకుడు మౌఖికంగా ఆదేశాలిచ్చారని చెబుతున్నారు. అందుకే పంచాయతీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది స్థలం విషయాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

పరిశీలిస్తాం..

పంచాయతీ రిజర్వు స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నట్లు నా దృష్టికి రాలేదు. రెండు రోజుల కిందటే దీనిపై నోటీసులు అందాయి. పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఈశ్వరమ్మ, పంచాయతీ ఈఓ, శ్రీకూర్మం

వైద్య సిబ్బంది నిరసన



ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమపై ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అనంతరం వైద్యాధికారి గంగా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రజియాబేగం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాతో విద్యార్థులకు మానసిక ప్రశాంతత చేకూరుతుందని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. సూర్య నమస్కారాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల

భక్తిశ్రద్ధలతో సత్యవ్రతాలు



జి.సిగడాం మండలం పెంట గ్రామంలో సింహాద్రి కళావతి పేరంటాలు గుడి వద్ద గురువారం సత్యవ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు భమిడిపాటి రంగాబాబు ఆధ్వర్యంలో దంపతులు వ్రతాలు ఆచరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– జి.సిగడాం

కల్యాణ వైభోగమే..!



కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు



వజ్రకవచధారణలో వేంకటేశ్వర స్వామివారు

పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భూనీళా సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను స్వర్ణాభరణాలతో అలంకరింపచేసి ఆలయ మహామండపంలో కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాల మధ్య యజ్ఞోపవీతధారణ, మంగళసూత్రధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ శ్యామలరావు, వేంకటరామానుజ సేవాదళం సభ్యులు ధర్మారావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాగా, కలియుగ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా 'వజ్రకవచ ధారణ' రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అమ్మవారిని కూడా వజ్రకవచ ధారణలో అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్యాలయంలో పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ కార్మికులను టెక్నికల్, నాన్–టెక్నికల్‌గా విభజించి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం గురువారం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు టి.తిరుపతిరావు మాట్లాడుతూ 15 ఏళ్లు పైబడి సర్వీసు ఉన్న వారిని క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. కార్మికులుగా ఉన్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు మజ్జి శ్రీను, రౌతు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెరువు ఆక్రమణ



ఆక్రమణకు గురైన చిన్న చెరువు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీలో పైడితల్లి అమ్మవారు వనం సమీపంలో చిన్న చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమించేశారు. చెరువు గర్భంలో నీరు ఉంటుండగానే సుమారు 50 అడుగులు మట్టితో కప్పేసి పక్కా భవన నిర్మాణాలు చేపట్టేందుకు పునాదులు కూడా నిర్మించేశారు. గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో యందువ జగన్నాథం వచ్చి ఆక్రమణలు పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడుతూ వెంటనే తొలగించాలని, లేదంటే జేసీబీతో తొలగిస్తామని స్పష్టం చేశారు.

స్థల ఆక్రమణపై కేసు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని మండల వీధిలో స్థలం ఆక్రమించి చొరబడేందుకు యత్నించిన ఐదుగురిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. రుప్ప రాంబాయికి చెందిన స్థలం కొన్నాళ్లుగా వివాదంలో ఉంది. కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పిచ్చింది. అయినప్పటికీ అదే స్థలంలోకి గురువారం రుప్ప లక్ష్మణరావుతో పాటు మరో నలుగురు వ్యక్తులు ఆక్రమణకు చొరబడటంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.